మహిళల రక్షణ కోసమే షీటీం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న షీటీం సిబ్బంది

జూలపల్లి: మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసమే పోలీసు షీటీంలు పనిచేస్తున్నాయని షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై మల్లన్న అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీం సేవలు, సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలకు గురైతే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలని సూచించారు. బస్టాండు ప్రాంతంలో, జనం ఎక్కువగా గుమిగూడే ప్రదేశాలు, కాలేజీ ప్రాంతాల్లో షీటీం నిఘా ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే షీటీం సభ్యులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. షీటీం సిబ్బంది సురేశ్, స్నేహలత, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ ఆశ్రిత, అస్మా, మాధవి, కళాశాల ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్ ఉన్నారు.

సామాజిక సేవలో సాయి సేవాసమితి


సాయి సేవాసమితిలో విద్యార్థులకు భోజనం

జ్యోతినగర్: రామగుండంలోని ఎన్టీపీసీ ఉద్యోగులు సామాజిక సేవలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం 1999 అక్టోబర్ 19న ఎన్టీపీసీ ఆస్పత్రిలోని సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ పోతారం రాందాసు నేతృత్వంలో సాయి సేవా సమితి ప్రారంభించారు. అప్పటినుంచి నేటివరకు అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. కాంట్రాక్టు కార్మికులకు వైద్యసేవలు అందిస్తున్నారు. సీఎస్సార్ ద్వారా విద్యార్థులకు దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. తరగతి గదులు నిర్మించి ఇస్తున్నారు. ప్రతీరోజు మధ్యాహ్న భోజనం అందించడంతోపాటు గురు, ఆదివారాల్లో పేదలకు అన్నదానం చేస్తున్నారు. మహిళలకు కుట్టుశిక్షణ, బ్యూటీషియన్, పేపర్ ప్లేట్ల తయారీలో శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తున్నారు. ఎన్టీపీసీ సహకారంతో సామాజిక సేవలో నిమగ్నమైన సాయి సేవా సమితి శనివారం 25వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం


మాట్లాడుతున్న సంఘం నాయకులు

పాలకుర్తి: బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి నేతృత్వంలోని కాంట్రాక్ట్ కార్మికసంఘం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలోని కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ అన్నారు. కంపెనీ ఆవరణలో శుక్రవారం కార్మికసంఘం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేశోరాంలో కాంట్రాక్ట్ కార్మికులు ఉద్యోగ విరమణ పొందితే యాజమాన్యం పట్టించుకోకపోయేదని, ప్రస్తుతం తమ యూనియన్ గెలిచిన తర్వాత యాజమాన్యం ఆధ్వర్యంలో కార్మికులకు ఘనంగా సన్మానినిస్తున్నామని తెలిపారు. తమ యూనియన్ గెలిచిన నాలుగు నెలల కాలంలోనే అర్హులైన 18మంది కాంట్రాక్ట్ కార్మికులకు కాంట్రాక్ట్ బేసిక్ కార్మికులుగా పదోన్నతి కల్పించామన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో విధులు నిర్వహించలేని కార్మికుల స్థానంలో వారి కుటుంబసభ్యులకు కంపెనీలో ఉద్యోగం కల్పించామని, ఇది కంపెనీ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. రానున్న కాలంలో కార్మికులకు ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని నేరవేర్చి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కార్మికసంఘం మాజీ ప్రధాన కార్యదర్శి ముల్కల కొమురయ్య, నాయకులు బత్తిని సతీశ్ గౌడ్, పెరుమాండ్ల రమేశ్, తీగల తిరుపతి, సందవేన రాజయ్య, బైరి రామకృష్ణ, కండె స్వామి, సాదిక్, పూసాల ప్రసాద్, వెంకటేశ్, పెద్దపల్లి నాగరాజు, దాడి బాపు పాల్గొన్నారు.

దీపావళి బోనస్‌పై అధికారులతో చర్చలు

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కార్మికులకు దీపావళి పండుగ సందర్భంగా చెల్లించే బోనస్ విషయమై కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశికహరి శుక్రవారం కంపెనీ అధికారులు చర్చలు జరిపారు. కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారథి చాంబర్‌లో జరిగిన చర్చల్లో కాంట్రాక్ట్ కార్మికులకు గతంలో చెల్లించిన బోనస్‌కు అదనంగా 20 నుంచి 30శాతం కలిపి చెల్లించాలని కౌశికహరి కోరారు. కేశోరాంకు అనుబంధ కంపెనీగా ఉన్న కర్ణాటకలోని వాసవిదత్తా సిమెంట్ కంపెనీ కార్మికులతో సమానంగా స్థానిక కార్మికులకు ఏటా యాజమాన్యం దీపావళి బోనస్ చెల్లించేదని, ప్రస్తుతం కూడా అదే మాదిరిగా చెల్లించాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. అయితే ప్రస్తుతం కేశోరాం కంపెనీ యాజమాన్యం మారిన నేపథ్యంలో వాసవిదత్తా కంపెనీతో సంబంధం లేకుండా కార్మికశాఖ నిబంధనలకు అనుగుణంగా బోనస్ చెల్లించేందుకు యాజమాన్యం సుముఖంగా ఉన్నట్లు అధికారులు కార్మికసంఘం నాయకులకు వివరించినట్లు సమాచారం. చర్చల్లో కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, హెచ్‌ఆర్ అధికారులు సదానందం, శ్యాంకుమార్, నాయకులు బత్తిని సతీశ్, పెరుమాండ్ల రమేశ్, తీగల తిరుపతి, బైరి రామకృష్ణ పాల్గొన్నారు.

పనివేళలను మార్చండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పనివేళలు మార్చాలని మున్సిపల్, పంచాయతీ లేబర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పెర్క రాజమల్లు కోరారు. కమిషనర్ వెంకటేశ్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. కరీంనగర్ కార్పొరేషన్ తరహాలోనే ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కార్మికులతో పని చేయించాలని విన్నవించారు. అత్యవసర పనులుంటే కార్మికులు హాజరవుతారన్నారు. ప్రస్తుతం రెండు పూటలా పనిచేయడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఒక్కపూట పని విధానం అమల్లోకి తేవాలని కోరారు. నాయకులు శంకర్, ఆంజనేయులు, స్వామి, కిష్టయ్య ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు రంగంపల్లి సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దబొంకూర్, పెద్దకల్వలతో పాటు రంగంపల్లిలో శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

గోదావరిఖనిలోని పలు ఏరియాల్లో..

గోదావరిఖనిటౌన్: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా గోదావరిఖనిలోని పలు ఏరియాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గోదావరిఖని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ అడిచర్ల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోని పీజీ సెంటర్, రామ మందిర్, గౌతమినగర్, జనగామ, అల్లూరు ఏరియాల సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

పాలకుర్తి మండల పరిధిలో..

పాలకుర్తి: మండల పరిధిలోని బసంత్‌నగర్, పుట్నూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రాల మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

హక్కులను కాపాడండి

గోదావరిఖనిటౌన్: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత న్యాయవాదులదే అని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు అన్నారు. స్థానిక జిల్లా అదనపు న్యాయస్థానంలో గురువారం జరిగిన ఆత్మీయ సన్మానంలో ఆయన మాట్లాడారు. ధర్మరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు. అనంతరం పెద్దపల్లికి బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తి శ్రీనివాసులును గోదావరిఖని బార్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మంజుల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్, ఏజీపీ నడిపల్లి కిషన్‌రావు, న్యాయవాదులు జవ్వాజి శ్రీనివాస్, రామటెంకి శ్రీనివాస్, పులిపాక ప్రవీణ్ కుమార్, బాస అనురాధ, దూడపాక లింగస్వామి, మాట్ల భానుకృష్ణ, ఎం.వరలక్ష్మి, రమేశ్, రవీందర్ సింగ్, శైలజ, అమరేందర్‌రావు, సంజయ్‌కుమార్, శాంతన్‌కుమార్, మురళీధర్ యాదవ్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఏఈగా వరలక్ష్మి

రామగిరి: మండల పంచాయతీరాజ్ ఏఈగా వరలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో శైలజారాణిని మర్యాదగా కలిసి విధుల్లో చేరారు. ముత్తారం మండలం నుంచి రామగిరికి బదిలీపై రాగా గతంలో పని చేసిన రవికుమార్ ఆరునెలల క్రితం భూపాల్‌పల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎంపీవో ఉమేశ్, కార్యదర్శులు ఏఈకి శుభాకాంక్షలు తెలిపారు.



పెద్దపల్లిరూరల్: పట్టణంలోని చీకురాయిరోడ్‌లో (9వవార్డు) చేపట్టిన రోడ్డు, డ్రైనేజీ పనులు ముందుకు సాగడం లేదు. రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేసిన అధికారులు డ్రైనేజీ పనులు అర్ధంతరంగా ఆపేయడంతోనే అవస్థలు మొదలయ్యాయని కాలనీకి చెందిన జక్కం భాను తదితరులు పేర్కొన్నారు. దీంతో మురుగునీరు ఇళ్ల ముందే నిలిచి, దుర్వాసన రావడంతో పాటు పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని వాపోతున్నారు. వీలైనంత త్వరగా అసంపూర్తిగా మిగిలిన పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మా ఫోన్ నంబర్ : 98499 71500

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సింగరేణి వార్తలు

ప్రతీఒక్కరు సమర్థంగా పనిచేయాలి


మాట్లాడుతున్న అధికారులు

గోదావరిఖని: సంస్థ స్థితిగతులను వివరించే మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశం శుక్రవారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–5 ఓసీపీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రమాదాలు లేని సింగరేణిగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. సమష్టిగా ముందుకు సాగి వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ప్రతీఒక్కరు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. లక్ష్యాల సాధనతోనే సంస్థ అభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో మేనేజర్ రమేశ్‌బాబు, అనిల్ గబాలే, అధికారులు ఆంజనేయులు, రాజన్న, డీవీరావు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రైతు సమస్యల పరిష్కారం కోసం వంటావార్పు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జనగామ గ్రామంలో శనివారం వంటావార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. గోదావరినదిలో నీరు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జనగామ గ్రామానికి అవతలి వైపు నీటి ప్రవాహం ఉండటంతో రైతులు పొలాలకు నీళ్లు పారించేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టామని, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరుకానున్నట్లు తెలిపా

జార్జిరెడ్డి ఆశయాలను కొనసాగించాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

గోదావరిఖనిటౌన్: విద్యావిధానంపై కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలని పీడీఎస్‌యూ నాయకులు ఐ.కృష్ణ పిలుపునిచ్చారు. గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది జిల్లా సభలో ఆయన మాట్లాడారు. నేడు దేశంలో కొనసాగుతున్న విద్యావిధానం, మనిషి నిజ జీవితంలో ఏ మాత్రం ఉపయోగపడటం లేదని ఆయన వాపోయారు. ఉస్మానియాలో 1972లో జార్జిరెడ్డి స్థాపించిన పీడీఎస్‌యూ 50ఏళ్లుగా విద్యార్థుల హక్కుల కోసం అనేక పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. జార్జిరెడ్డి ఆశయాలను కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో పీడీఎస్‌యూ ముఖ్య పాత్ర పోషించిందని, ఎందరో విద్యార్థులు తమ ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. ఈ సభలో నాయకులు కృష్ణస్వామి, సాలగామ మల్లేశ్, శ్రీనివాసరెడ్డి, ఇ.నరేశ్, బి.అశోక్, బడికెల ప్రసన్నకుమార్, వంశీ, సోయల్, సాయికృష్ణ, రాజ్‌కుమార్, రాకేశ్, ప్రణీత్, బి.ఆనంద్, ఎడ్ల రవికుమార్, ఎం.దుర్గయ్య, జనగాం రాజన్న, కాంపెల్లి మల్లేశ్ పాల్గొన్నారు.

మంథని నియోజకవర్గం రోడ్ల అభివృద్ధికి రూ.25కోట్లు

మంథని: నియోజకవర్గంలోని మంథని, కమాన్‌పూర్, రామగిరి, కాటారం మండలాల్లో నూతన రోడ్ల నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరయ్యాయి. మంథని మండలం ఖానాపూర్ పీడబ్ల్యూడి రోడ్ నుంచి ఎల్ మడుగు వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.7కోట్లు నిధులు మంజూరయ్యాయి. అలాగే కమాన్‌పూర్ నుంచి పెంచికల్‌పేట వరకు రోడ్డు వెడల్పునకు రూ.4 కోట్లు, రామగిరి మండలం రాజాపూర్ బ్రిడ్జి రోడ్డు, మంగపేట వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.3 కోట్లు వెచ్చించారు. కాటారం మండలం ఒడిపిలవంచ నుంచి గూడూరు రోడ్డుకు రూ.3కోట్లు, గుండ్రాత్‌పల్లి నుంచి ఊట్లపల్లి టెంపుల్ వరకు రూ.2కోట్లు, దామెరకుంట నుంచి ఆరెంద వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరయ్యాయి. దన్వాడ పీడబ్ల్యూడి రోడ్డు నుంచి బూడిదపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3.95 కోట్లు సీఆర్ఆర్ నిధులు కేటాయింపు జరిగినట్లు మంత్రి శ్రీధర్‌బాబు క్యాంపు కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో వెల్లడించారు.

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా సాకేత్



యైటింక్లయిన్‌కాలనీ: బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఇజ్జగిరి సాకేత్‌ను నియమిస్తున్నట్లు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ప్రకటించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ శుక్రవారం సాకేత్‌ను సన్మానించి అభినందించారు.

కూల్చివేతకు పూనుకుంటే ఊరుకోం

గోదావరిఖని: తమ ప్రాంతంలో కూల్చివేతలకు పూనుకుంటే ఊరుకునేది లేదని, న్యాయపరంగా ముందుకు వెళ్తామని నగరవాసి వేముల అశోక్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసు కోర్టులో ఉండగా ఓల్డ్ అశోక్ టాకీస్ పరిధిలో కూల్చివేతలకు పాల్పడితే ఊరుకోబోమన్నారు. అడ్వకేట్ పులిపాక రాజ్‌కుమార్, శీలం శ్రీనివాస్, దేవి రాజు, నీరటి శంకర్ పాల్గొన్నారు.

నియామకం

ధర్మారం: రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా మండలంలోని రచ్చపల్లికి చెందిన చింతల తిరుపతిని నియమించినట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ తెలిపారు. తనను ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా నియమించిన జిల్లా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

• ఉపాధిహామీ పనులపై గ్రామసభ

రామగిరి: మండలంలోని బుధవారంపేట గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. బుధవారంపేట పంచాయతీలో 2025–26లో చేపట్టనున్న ఉపాధిహామీ పనులకు సంబంధించి గ్రామసభ నిర్వహించి పనులు గుర్తించారు. ఎంపీడీవో శైలజారాణి, టీఏ అఖిల, కార్యదర్శి రాకేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ సతీశ్ పాల్గొన్నారు.

• మున్నూరుకాపు సంఘం మండల కార్యవర్గం ఖరారు

ధర్మారం: మున్నూరుకాపు సంఘం మండల పూర్తిస్థాయి కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు రాజేందర్, కొత్త మోహన్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా దీటి శ్రీనివాస్, మిట్ట తిరుపతి, కుంటూరు ప్రదీప్, గౌరవ సలహాదారులుగా రాచూరి శ్రీధర్, పంచాల రాజేశం, ఆవుల శ్రీనివాస్, మంద శ్రీనివాస్, ఎగ్గెల స్వామి, ఉపాధ్యక్షులుగా ముదం శ్రావణ్‌కుమార్, గాండ్ల నర్సయ్య, నారా ప్రేమ్‌సాగర్, గోరువంతుల శ్రీనివాస్, సాన రాజేందర్, కార్యదర్శిగా ఎడపల్లి సంతోష్, జంగిలి లక్ష్మణ్, అనుమల్ల శ్రీనివాస్, సాగంటి లచ్చయ్య, సహాయ కార్యదర్శులుగా ఆకారి మహేశ్, సాన శంకరయ్య, ఆరె కొమురయ్య, సాయిని కొమురయ్య, చిందం మల్లేశంతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు మండల శాఖ ప్రధాన కార్యదర్శి కొత్త మోహన్ పేర్కొన్నారు.

• తహసీల్ పక్కా భవనానికి రూ.60లక్షలు మంజూరు

ఓదెల: ఓదెల తహసీల్దార్ కార్యాలయం పక్కా భవనానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష తన నిధుల నుంచి రూ.60లక్షలు మంజూరు చేసినట్లు తహసీల్దార్ కె.యాకన్న శుక్రవారం తెలిపారు. ఓదెల తహసీల్ కార్యాలయాన్ని ఇటీవల కలెక్టర్ సందర్శించినపుడు రైతులు, మండల ప్రజలు పక్కాభవనం గురించి విన్నవించారు. స్పందించిన కలెక్టర్ తహసీల్ పక్కా భవనం కోసం నిధులు మంజూరు చేశారు. దీనిపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

• నేడు ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలు

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఉదయం 10గంటలకు ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్, డీవైఎస్‌వో సురేశ్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, ఏసీపీ గజ్జి కృష్ణ, డీఈవో మాధవి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు హాజరవుతారని వారు తెలిపారు.

• ముగిసిన భవన నిర్మాణ కార్మికుల శిక్షణ

ముత్తారం: మండలంలోని ఓడెడ్‌లో గత నెల 30 నుంచి భవన నిర్మాణ కార్మికులకు న్యాక్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. గ్రామానికి చెందిన 80మంది భవన నిర్మాణ కార్మికులకు న్యాక్ బృందం శిక్షణ ఇచ్చారు. 80మంది కార్మికుల భద్రత కోసం హెల్మెట్, టీషర్టులు పంపిణీ చేశారు. న్యాక్ సభ్యులు వి.శ్రీనివాస్, ఎస్.రాములు, భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు కొలాని కుమార్, ఉపాధ్యక్షుడు సంపత్, కన్వీనర్లు సాయికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

• మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దు

సుల్తానాబాద్: పొగాకు, గుట్కాతో ఆరోగ్యం పాడవుతుందని గర్రెపల్లి పీహెచ్‌సీ సెంటర్ హెచ్‌ఈవో ఎండీ అనిసోద్దీన్ విద్యార్థులకు సూచించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. పొగాకు, గుట్కాలకు దూరంగా ఉండాలని సూచించారు. గాంధీనగర్‌లో 30ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసి మందులు పంపిణీ చేశామని తెలిపారు. హెచ్ఎం శారద, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

• చికిత్స పొందుతూ యువకుడు మృతి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన దుగ్గాల జితేందర్‌రావు(22) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా శుక్రవారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం మృతుడి స్వగ్రామం జూలపల్లి మండలం వెంకట్రావ్‌పల్లి. కాగా తల్లి లక్ష్మీ కొదురుపాకలో ఉంటున్న తన అన్న రవీందర్‌రావ్‌కు పిల్లలు లేకపోవడంతో రవీందర్‌రావు జితేందర్‌రావును పెంచుకోగా వ్యవసాయ పనులు చూసుకుంటున్నాడు. 15న దసరా పండుగకు తల్లి కొదురుపాకకు వచ్చింది. జితేందర్ మద్యం తాగి ఇంటికి రాగా మద్యం తాగొద్దని తల్లి మందలించింది. మనస్తాపం చెందిన జితేందర్ స్థానిక హనుమాన్ ఆలయ సమీపంలో పురుగుల మందు తాగాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా శుక్రవారం ఉదయం మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• గేదెను ఢీకొన్న బైక్.. ఒకరికి తీవ్రగాయాలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో గురువారం రాత్రి బైక్ గేదెను ఢీకొనడంతో వాహనదారుడు జబ్బర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జబ్బర్ తలకు తీవ్ర గాయాలైయినట్లు వైద్యులు తెలిపారు. ఎఫ్టీపీసీ సర్కిల్ నుంచి గౌతమినగర్ వరకు రోడ్డుపై వీధిదీపాలు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధిదీపాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ట్రినిటి విద్యార్థులు అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో మణిహాస్, లక్ష్మీనరసింహ పాల్గొంటారు. వీరిని విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్ ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి శుక్రవారం అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


చిన్నారులతో ఉమెన్ కమిషన్ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం సుందిళ్లలోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఉమెన్ కమిషన్ సభ్యులు రేవతి, సుధాలక్ష్మి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ పాఠశాలలోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కాసేపు చిన్నారులతో ముచ్చటించి సరదాగా గడిపారు. అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు తిరుపతమ్మ, చంద్రకళ ఉన్నారు.

పద్మశాలీ దసరా మేళా విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: హైదరాబాద్‌లో ఈనెల20న నిర్వహించే పద్మశాలీ దసరా మేళా ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని పద్మశాలీ సేవా సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ చైర్మన్ వల్స నీలయ్య కోరారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో నిర్వహించే దసరా మేళాకు సంబంధించిన పోస్టర్‌ను మండల కేంద్రంలో శుక్రవారం స్థానిక పద్మశాలీ సంఘం నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మశాలీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి, రానున్న రోజుల్లో ఒకే వేదికపై తీసుకువచ్చి అలయ్ బలయ్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని పున్న గణేశ్ నేత, ప్రధాన కార్యదర్శి గడ్డం లక్ష్మీనారాయణ, దసరా మేళా చైర్మన్ కొకుంట్ల రవితేజ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పద్మశాలీలు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సేవాసంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ మెంబర్ పెగడ చందు, నాయకులు కొండ సత్యనారాయణ, పెగడ పర్శరాములు, కామణి రాజేంద్రప్రసాద్, వలస భాస్కర్, సతీశ్, పెగడ ఐలయ్య, ఇప్పకాయల నారాయణ, గుడ్ల సత్యనారాయణ, నల్ల రాజేశం, దూడం సతీశ్, వెంగళ అంజయ్య పాల్గొన్నారు.

క్రీడలతో ఏకాగ్రత, పట్టుదల పెరుగుతాయి

సుల్తానాబాద్: క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల పెరుగుతాయని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అండర్ 14, 17 బాలబాలికల వాలీబాల్ క్రీడాపోటీల్లో స్థానిక ఇండియన్ పబ్లిక్‌స్కూల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. శుక్రవారం విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. జిల్లా స్థాయి వాలీబాల్ అండర్–14 బాలికల విభాగంలో డి. ప్రియదర్శిని, కె.లాస్య, ఖుషి, అండర్–14 బాలుర విభాగంలో అద్వైత్, ఎం.అక్షిత్, సుశాంత్, 17 ఏళ్ల విభాగంలో నిఖిల్, లిఖిత ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లాస్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, ఇక్బాల్ శివ, సతీశ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్‌లో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ప్రమోద్‌కుమార్ పాల్గొని స్థానిక రైతులకు ఆయిల్‌పాం సాగు విధానం గురించి వివరించారు. ఏఈవోలు శశిధర్, యోజన పాల్గొన్నారు.